










సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 30-9-2024

సంపుటి: 20 సంచిక: 160

పేజీలు: 4 వెల: రూ.1










# 'వెంకటేశ' మహాత్మ్యం!

- బాధితుల నుంచే సొమ్ముల వసూళ్లు
- కేసు నమోదుకూ ఓ రేటు
- జనరల్ కానిస్టేబులే అక్కడ సర్వం
- రెండువైపులా సొమ్ములు పిండేస్తున్న వైనం
- సొమ్ముల వసూళ్ల కోసం ప్రైవేటు ఏజెంట్లు



విరిగిన కాలితో బాధితురాలి సోదరి లక్ష్మి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో జీఎస్టీ అమలులోకి రాక ముందు రాష్ట్ర సరిహద్దు ఇచ్ఛాపురం శివార్లలో పురుషోత్తపురం వద్ద కమర్షియల్ టాక్స్ టోల్‌గేట్ ఉండేది. పక్క రాష్ట్రం నుంచి వచ్చే సరుకులను మినహాయించేందుకు ఇక్కడ సొమ్ములు వసూలుచేయడానికి ఈ శాఖతో సంబంధం లేని ఉద్యోగులు పని చేసేవారు. ఎన్నిసార్లు ఏసీబీ రైడ్ జరిగినా ఈ థర్డ్‌పార్టీ ఉద్యోగులే దొరికేవారు. ఇప్పుడు సరిగ్గా అటువంటి వ్యవస్థనే జిల్లాలో అనేక పోలీస్ స్టేషన్లలో జనరల్ కానిస్టేబుళ్లు నడుపుతున్నారు. కలెక్షన్ల కోసం వీరిని వాడుకుంటూ అనధికారిక పోలీస్ హోదాను ఇస్తున్నారు. ఒకవేళ ఏసీబీ లాంటి రైడ్‌లు జరిగితే తమకు ప్రమాదం లేకుండా చూసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఓ తాజా ఉదాహరణను చూద్దాం.

స్థానిక హయాతినగరంలో పెళ్లయిన పదేళ్ల తర్వాత తన భర్త వేరే మహిళతో సంబంధం పెట్టుకున్నారని ఒక మహిళ రాగోలులో కన్నవారింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల సలహా మేరకు మే 23 మధ్యాహ్నం తిరిగి తన ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న భర్త ఆమెపై విచక్షణరహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అడ్డుకున్న బాధితురాలి తల్లిని కూడా చితకబాదాడు. ఈ కథ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో, ఆమెను రిమ్స్ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి నాలుగు రోజుల పాటు చికిత్స చేయించారు. మే 25న టూటౌన్‌లో ఈమె భర్తపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఓ కానిస్టేబుల్ బాధిత మహిళకు న్యాయం చేస్తానని, అతనికి వేరే మహిళతో ఉన్న అక్రమ సంబంధాన్ని కూడా బయటపెడతానని చెప్పి బాధిత మహిళ నుంచి రూ.1.50లక్షలు నొక్కేశాడు. తన భర్తకు బుద్ధి చెప్పి వేరే మహిళ మాయ నుంచి బయటపడేస్తారన్న ఆశతో ఏదో ఒకటి చేసి ఆమె ఈ సొమ్ములు సమర్పించింది. సీన్ కట్ చేస్తే.. అదే సమయంలో భార్యపై దాడి చేసిన భర్త వద్ద నుంచి కూడా రూ.30వేలు తీసుకొని తేలికపాటి సెక్షన్లు నమోదుచేసి స్టేషన్ బెయిల్ వచ్చే విధంగా కేసును తిప్పేశారు. అంటే.. గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు తీసుకోడానికే రూ.1.50 లక్షలు ఖర్చయినట్లు లెక్క. మొత్తం భార్యాభర్తల నుంచి రూ.1.80 లక్షలు నొక్కేసి పోలీసులు చేతులెత్తేశారు.

ఈ కేసులో భార్య మీద దాడి చేసిన నిందితుడు కార్‌డ్రైవర్‌గా ఓ ట్రావెల్ ఏజన్సీలో పని చేసేవాడు. పోలీసులు చేసిన పనికి బాధితురాలు హయాతినగరంలోనే తన భర్త ఇంటికి దగ్గరగా వేరే ఇల్లు తీసుకొని ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. ట్రావెల్ ఏజెన్సీ యజమాని భార్యతో వివాహేతర సంబంధాన్ని గట్టి చేసుకోడానికి తనకు విడాకులు ఇవ్వబోతున్నట్టు తెలుసుకున్న బాధితురాలు ఈనెల 14న తన సోదరిని పట్టుకొని భర్తను నిలదీసే ప్రయత్నం చేసింది. దీంతో మరోసారి బాధితురాలి మీద దాడి జరిగింది. ఈ గొడవలో బాధితురాలి సోదరి లక్ష్మి కాలు కూడా విరిగింది. మళ్లీ పోలీసులే రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు.

గతంలో భార్య ఫిర్యాదు చేస్తే రూ.1.50 లక్షలు తీసుకున్న కానిస్టేబుల్ ఇప్పుడు మళ్లీ దాడి చేసిన వారిని ఈ కేసు నుంచి తప్పించడానికి డబ్బులు దండుకుంటున్నట్టు తెలుస్తుంది. డ్రైవర్‌తో వివాహేతర సంబంధం నెరుపుతున్న ట్రావెల్స్ యజమాని భార్య ఇంతకు క్రితం తన కుమార్తెను పావుగా వాడుకొని భర్త మీద పోక్సో కేసు పెట్టించి జైలుకు పంపించింది. ఈయన జైలులో ఉన్నప్పుడే కలెక్టరేట్, ఎన్‌ఏసీఎల్ నుంచి ట్రావెల్ ఏజెన్సీ పేరుతో వచ్చిన రూ.28 లక్షలు చెక్కులను ఈ డ్రైవర్, ట్రావెల్ ఏజెన్సీ యజమాని భార్య కలిసి విత్‌డ్రా చేసినట్లు స్వయంగా ట్రావెల్స్ నడుపుతున్న వ్యక్తే అప్పటి ఎస్పీకి మార్చి 27న రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపారు. దీనిపై విచారణ జరపాలని అప్పటి రూరల్ ఎస్ఐకి ఎస్పీ రాధిక ఆదేశించారు. అయితే ఈ కేసును రిజిస్టర్ చేయడానిక - మిగతా 4లో

ఈనెల14న భార్యపై దాడి చేస్తున్న దృశ్యాలు





హస్సన్ నస్రల్లా.. బతికున్నాడా, చనిపోయాడా..? ఒసామా బిన్ లాడెన్ చనిపోయినప్పుడు కొన్నాళ్లు జరినట్టుగానే ఈ చర్చ ఇప్పటితో ఆగకపోవచ్చు! కానీ, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ దాడుల్లో నస్రల్లా చనిపోయాడన్నది.. ఇప్పుడు ఇజ్రాయెల్ మీడియా చెబుతున్న కథ! సరే, నస్రల్లా బతికే ఉన్నాడా.. చనిపోయాడా అన్నది మెల్లిగా తెలిసినా తక్కిన ప్రపంచానికి పోయేదేంలేదు. కానీ, అసలు నస్రల్లా ఎవరు మొస్సాద్ వంటి బలమైన పరిశోధనాత్మక ఏజెన్సీలను కల్గి ఉన్న ఇజ్రాయెల్‌ను గడగడలాడించిన అతగాడి కథేంటి?

## ఇజ్రాయెల్ పాలిట విలన్.. అరబ్బుల హీరో

# నస్రల్లా కథేంటి?

బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

ఇజ్రాయెల్‌ను గడగడలాడించిన ప్రాణాంతక శత్రువు పేరు నస్రల్లా! ఓ కూరగాయల వ్యాపారి కొడుకు.. లెబనాన్ కేంద్రంగా ఏర్పాటై శాసిస్తున్న హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా!!

సరిగ్గా తన 16వ ఏటనే.. లెబనాన్ ఆధారిత సంస్థైన హెజ్బొల్లా అప్పటి నాయకుడు అల్ ముసావీ దృష్టిని ఆకర్షించాడు. అలా ముసావీతో బలమైన బంధమేర్పడింది. ఇజ్రాయెల్ క్షిపణి దాడిలో ముసావీ మరణించిన తదనంతరం 1992లో హెజ్బొల్లాకు నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు నస్రల్లా.

కేవలం 32 ఏళ్ల వయస్సులోనే హెజ్బొల్లా బాధ్యతలు స్వీకరించాక.. అసలు ముసావీ కలలుగన్న దానికంటే కూడా హెజ్బొల్లాను మరింత శక్తివంతంగా మార్చాడు. అంత బలంగా హెజ్బొల్లా తయారవుతుందని కనీసం ఇజ్రాయెల్ సైనిక ఏజెన్సీస్ కూడా ఊహించలేదు. అలా లెబనాన్ ప్రభుత్వంలో హిజ్బొల్లా భాగస్వామ్యమై మిడిల్ ఈస్ట్ లో ఓ పవర్ ఫుల్ పొలిటికల్ ఆర్గనైజేషన్ గా స్థిరపడటంలో నస్రల్లాదే కీలకపాత్ర. అయితే, 2006లో ఇజ్రాయెల్‌తో యుద్ధం తర్వాత.. నస్రల్లా అజ్ఞాతవాసయ్యాడు. ఫోటోల్లో, టీవీ స్క్రీన్స్ పైన మినహా.. బయటెక్కడా కనిపించకుండా రహస్య స్థావరాన్నేర్పాటు చేసుకున్న నస్రల్లా.. ఒక శక్తివంతమైన వక్త. ఆరేటర్‌గా తన హెజ్బొల్లా సంస్థ బలపడేలా నస్రల్లా చేసిన ప్రసంగాలు వింటే అర్థమవుతుంది ఆయనెంత టాప్ కమ్యూనికేటరో! ఈమధ్య లెబనాన్ లో జరిగిన పేజర్ పేలుళ్లపై కూడా నసరల్లా చేసిన తాజా ప్రసంగంలోనూ..ఇదంతా ఇజ్రాయెల్ చేసిన యుద్ధప్రకటనగానే భావించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు.

ఇరాన్‌కు చెందిన షియా నేతల ఆధ్వర్యంలో నడిచే యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ లీడర్స్‌తో మాత్రమే ఈమధ్య నస్రల్లా ఫోటోల్లో తరచూ కనిపించారు.

తనను చంపేశామంటూ, తనపై దాడి జరిగిందంటూ ఇజ్రాయెల్ పుట్టించేవన్నీ పుకార్లేనని.. ఆ పుకార్లతో తనను రహస్య బంకర్స్ నుంచి బయటకు తీసుకొచ్చే ఓ కుట్రగా 2014లోనే అల్ అక్బర్ అనే వార్తా పత్రికతో మాట్లాడినప్పుడు చెప్పుకొచ్చాడు. బంకర్లలో దాక్కున్న వారి హెచ్చరికలను తాము పట్టించుకోమని గతంలో నేతాన్యాహు ప్రకటించాడు. తాను కేవలం బంకర్లకే పరిమితమయ్యేవాడిని కాదని, స్వేచ్ఛగా తిరుగగలనని.. ఎంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినా తననేమీ చేయలేరని కౌంటర్ ఇచ్చాడు నస్రల్లా. తన మిషన్‌లో భాగంగా తన మిత్రులతో కలిసే విషయంలో తనను ఇజ్రాయెల్ కాదు కదా ఇంకెవ్వరూ కూడా ఆపలేరన్న విశ్వాసాన్ని ఆ మీడియా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు నస్రల్లా!

హెజ్బొల్లాను మెయిన్ ఫోకస్ చేసిన ఇజ్రాయెల్ ఇప్పటికే దానికున్న సాంకేతిక, సైనిక సామర్థ్యంతో పెద్దఎత్తున చాలామందిని లేపేసింది. దాంతో ఇప్పుడు హెజ్బొల్లా నాయకత్వానికే అది గందరగోళంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో హెజ్బొల్లా తన మూలాలను కాపాడుకోవాలంటే.. తమ కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలంటే మాత్రం నస్రల్లా వంటి లీడర్ షిప్ మాత్రమే ఆ సంస్థకు నైతిక బలం.

అదిగో, ఇలాంటి పరిస్థితుల్లోనే చావు నీడ కూడా తనపై పడకుండా ఉండేలా నస్రల్లా రహస్య బంకర్ లో ఎక్కడో ఓ బయటపడని పురాతన విగ్రహంలా దాక్కున్నాడు.

అయితే, నిన్న రాత్రి బీరూట్ లోని హెజ్బొల్లా ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ చేసిన దాడిలో.. నాలుగు భవనాలు నేలమట్టమయ్యాయి. మట్టిగా మారిపోయిన ప్రధాన కార్యాలయంలోని బంకర్ లోనే నస్రల్లా ఉండి ఉండొచ్చునన్న వార్తలు ఇప్పుడు మిన్నంటుతు న్నాయి. ఇదే విషయాన్ని ఇజ్రా యెల్ మీడియాతో పాటు.. మరికొంత ఇజ్రాయెల్ అనుకూల మీడియా, అమెరికన్ మీడియా కూడా ప్రచారానికి పెట్టిందిప్పుడు. కానీ, నస్రల్లా సజీవంగా ఉన్నాడా.. చనిపోయాడా అన్నది మాత్రం ఇంకా ధృవీకరణ కావల్సి ఉంది.

### ఓ కూరగాయల వ్యాపారికి జన్మించిన వ్యక్తే కాదు.. కొడుకును త్యాగం చేసిన తండ్రి కూడా!

నస్రల్లాను కేవలం హెజ్బొల్లా చీఫ్‌గా మాత్రమే చూడటం కాదు. 1997లో ఇజ్రాయెల్ సైనికులతో పోరాటంలో.. తన పెద్ద కొడుకు అబూ హదీని కేవలం 18 ఏళ్ల ప్రాయంలో కోల్పోయినట్టు ది న్యూయార్క్ పోస్ట్ వెల్లడించింది. 1960లో జన్మించిన నస్రల్లా.. క్రిస్టియన్ ఆర్మేనియన్స్, డ్రూస్, పాలస్తీయన్లతో కలిసి బీరూట్ పేద గుడిసెల్లో గడిపాడు. ఓ కూరగాయల వ్యాపారికి తొమ్మిది మంది సంతానంలో నసరల్లా ఒకడు. ఫాతిమా హోసిన్ ను వివాహం చేసుకున్న నస్రల్లాకు నలుగురు పిల్లలు.

1978 సమయంలో సద్దాం హుస్సేన్ ప్రభుత్వం షియా కార్యకర్తలపై విరుచుకుపడుతున్నప్పుడు.. ఇరాక్ లోని నజాఫ్ సెమినరీలో మూడేళ్లపాటు మత శాస్త్రాలను అభ్యసించాడు నస్రల్లా. అదిగో ఆ సమయంలోనే తన గురువైన అబ్బాస్ అల్ ముసావీనితో నస్రల్లాకు పరిచయమేర్పడిందనేది మిడిల్ ఈస్ట్ న్యూస్ ఏజెన్సీ కథనం.

### హెజ్బొల్లా ఏర్పాటెలా జరిగింది..?

యాసర్ అరాఫత్ వంటివారు కీలకపాత్ర పోషించిన పాలస్తీయన్ లిబరేషన్ ఆర్గనైజేషన్ ను నామరూపాలలేకుండా చేసేందుకు 1980 సమయంలో ఇజ్రాయెల్ దాడులు చేసింది. అలా పీఎల్వోను తరిమికొట్టి ఉంది. దానికి కక్షసాధింపు చర్యగా కొందరు కలిసి లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా 1982లో ఏర్పాటు చేసిందే హెజ్బొల్లా!

హెజ్బొల్లా పగ్గాలను 1992లో చేపట్టేకంటే ముందే.. నస్రల్లా, లెబనీస్ రెసిస్టెన్స్ రెజిమెంట్స్ నాయకులకిచ్చే ర్యాంకుల్లో టాప్ పొజిషన్ లో నిల్చాడు. అలా అపార అనుభవం సంపాదించాడు.

### హెజ్బొల్లాను శక్తివంతంగా మార్చే క్రమంలో.. నస్రల్లా ఇమేజ్ ఏవిధంగా ఉపయోగపడింది..?

అప్పటివరకూ షియా ఇస్లాం మూలాలకు మాత్రమే పరిమితమైన హెజ్బొల్లాను మొట్టమొదట శత్రువుకు శత్రువు మిత్రుడనే కోవలో.. అందరినీ దగ్గరకు తీయడం మొదలెట్టి హెజ్బొల్లా సంస్థలో ఓ కొత్త రాజకీయానికి తెరతీశాడు నస్రల్లా. నస్రల్లా సంప్రదాయ మత మౌఢ్యుడు కాదు. ఆయనేనాడు ముస్లిం మహిళలు బురఖాలు ధరించాలన్న నియమాలను ప్రోత్సహించలేదు. అయితే, నస్రల్లా జీవన పోరాటమంతా జెరూసలేం విముక్తి కోసమే సాగుతోంది. ఇజ్రాయెల్ వ్యవహారశైలిని కేవలం జూయిష్ దేశంగా మార్చే జియోనిస్ట్ అస్తిత్వంగా పేర్కొన్న అతను.. ముస్లింలు, యూదులు, క్రైస్తవులు సమానత్వంతో జీవించగల్గే పాలస్తీనా ఏర్పాటు కావాలన్న సంకల్పంతో ఇజ్రాయెల్ ను ఢీకొడుతున్నట్టుగా కూడా న్యూయార్క్ టైమ్స్ వంటి పత్రికలు పేర్కొన్నాయి. చురుకైన రాజకీయ, సైనిక నాయకుడిగా హెజ్బొల్లాను లెబనాన్ సరిహద్దులు దాటి విస్తరించగల్గాడు నస్రల్లా. ప్రతీ పౌరుడూ ఓ సైనికుడిగా తయారయ్యే విధంగా తన ప్రసంగాలతో హెజ్బొల్లాను ఓ మిల్షియా తరహా ఆర్గనైజేషన్ గా తీర్చిదిద్దాడు.

2011లో సిరియా అధ్యక్షుడు బషల్ ఆల్ అస్సాద్ పాలనపై తిరుగుబాటును అణిచివేయడంలోనూ.. సన్రల్లా నేతృత్వంలోని హెజ్బొల్లా సాయం చేసింది. నాయకత్వ బాధ్యతల విషయంలో హెజ్బొల్లాలో అంతర్గతంగా తనకెదురైన సవాళ్లను కూడా ఇరాన్ సాయంతో ఛేదించాడు నస్రల్లా. 1997లో అలా నస్రల్లాకు వ్యతిరేకంగా మాజీ హెజ్బొల్లా నాయకుడైన షేక్ సుభీ తుఫైలీ తిరుగుబాటు చేస్తే.. షేక్ సుభీతో పాటు.. ఆయన అనుచరులను నిరాయుధులను చేసి.. హెజ్బొల్లాలో తనకు ఎదురులేదనిపించాడు.

### ఇజ్రాయెల్‌తో యుద్ధాల తర్వాత హీరోగా మారిన నసరల్లా!

ఇజ్రాయెల్‌తో యుద్ధాలే అరబ్ ప్రపంచంలో - మిగతా 3లో




# కాలమే గాయాలను మాన్పుతుంది!

అలా అనుకోకుండా ఒకరోజు నికిత దినేష్ కార్తీక్ తోటి ఆటగాడు మురళీ విజయ్‌ని కలిసింది. నికితకు మురళీవిజయ్ అంటే ఇష్టం ఏర్పడింది. ఈ విషయాన్ని అమాయక స్వభావి దినేష్ కార్తీక్ గుర్తించలేకపోయాడు. నికిత, మురళి మధ్య సాన్నిహిత్యం పెరగడం ప్రారంభించింది. తక్కువ కాలంలోనే వారి అనుబంధం ప్రారంభమైంది. ఇద్దరూ బహిరంగంగా కలవడం ప్రారంభించారు. మురళీ విజయ్ తన కెప్టెన్ దినేష్ భార్య నికితతో ప్రేమలో ఉన్నాడని దినేష్ కార్తీక్‌తో పాటు తమిళనాడు టీమ్ మొత్తానికి తెలిసింది. ఆపై 2012 సంవత్సరం వచ్చింది. నికితా గర్భవతి అయింది. అయితే ఈ చిన్నారి మురళీ విజయ్ వారసత్వమేనని దినేష్ కార్తీక్ విరుచుకుపడ్డాడు. కొన్ని రోజులకు అతను నికితతో విడాకులు తీసుకున్నాడు. విడాకులు తీసుకున్న మరుసటిరోజే నికిత మురళీవిజయ్‌ని పెళ్లి చేసుకుంది. కేవలం 3 నెలల తర్వాత వారికి ఒక బిడ్డ పుట్టింది. దినేష్ కార్తీక్ డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. దీంతో మానసిక అస్వస్థతకు గురయ్యాడు. తన భార్య, స్నేహితుడు మురళి చేసిన ఈ మోసాన్ని అంత తేలిగ్గా మర్చిపోలేకపోయాడు తాగడం అలవాటైంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం సేవించడం మొదలుపెట్టాడు. దేవదాసులా మారిపోయాడు. దీంతో అతడిని భారత జట్టు నుంచి తప్పించారు. తరువాత రంజీ ట్రోఫీలోనూ విఫలమయ్యాడు. తమిళనాడు జట్టు కెప్టెన్సీ అతడికి దూరమైంది. ఇక మురళీ విజయ్‌ని కెప్టెన్‌గా నియమించారు.. వైఫల్యాల కాలం ఇక్కడితో ఆగలేదు, ఐపీఎల్‌లో జట్టు కూడా చోటివ్వలేదు. జిమ్‌కి వెళ్లడం కూడా మానేశాడు. ఆఖరికి దినేష్ తీవ్ర నిరాశకు లోనయ్యాడు, అతను ఆత్మహత్య గురించి కూడా ఆలోచన చేయడం ప్రారంభించాడు. తర్వాత ఒకరోజు జిమ్‌లోని అతని ట్రైనర్ అతని ఇంటికి వచ్చాడు. అతను దినేష్ కార్తీక్‌ని దారుణమైన స్థితిలో చూసి. అతడిని పట్టుకుని నేరుగా జిమ్‌కి తీసుకువచ్చాడు. కార్తీక్ నిరాకరించాడు కానీ అతని ట్రైనర్ అతని మాట వినలేదు. భారత స్క్వాష్ మహిళల ఛాంపియన్ దీపికా పల్లికల్ కూడా ఇదే జిమ్‌కి వచ్చేవారు. దినేష్ కార్తీక్ పరిస్థితిని చూసిన ఆమె ట్రైనర్‌తో కలిసి దినేష్ కార్తీక్‌కు కౌన్సెలింగ్ ప్రారంభించాడు. ట్రైనర్, దీపికల కష్టానికి ఫలితం దక్కడం మొదలైంది. అప్పుడు దినేష్ కార్తీక్ మెరుగ్గా ఉన్నాడు. మరోవైపు మురళీవిజయ్ ఆట అంతకంతకూ సాగింది. ఇక్కడ మురళీ విజయ్‌ని భారత జట్టు నుంచి తప్పించారు. తర్వాత ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ కూడా అతని పేలవమైన ఫామ్ కారణంగా అతడికి ఇంటి దారి చూపించింది. మరోవైపు దీపికా పల్లికల్ మద్దతుతో దినేష్‌కార్తీక్ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాడు. దాని ప్రభావం చూపడం ప్రారంభించింది. దినేష్ కార్తీక్ దేశవాళీ క్రికెట్‌లో భారీ స్కోర్లు చేయడం ప్రారంభించాడు. త్వరగానే అతను ఐపీఎల్‌కు ఎంపికయ్యాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా నియమించబడ్డాడు. అతను దీపికా పల్లికల్‌కి చాలా దగ్గర అయ్యాడు. కొన్నాళ్ళకు దీపికను పెళ్లాడాడు. క్రికెట్ వయస్సు ప్రకారం, దినేష్ ఇప్పుడు పెద్దవాడు. క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇక్కడ అతని భార్య దీపికా పల్లికల్ గర్భవతి అయ్యి కవలలకు జన్మనిచ్చింది. దీపిక స్క్వాష్ ఆడటం కూడా ఆగిపోయింది. దీపికా, దినేష్ కార్తీక్ తమ పోయెస్ గార్డెన్‌ను చెన్నైలోని ఎలైట్ ఏరియాలో బంగ్లాగా ఉండాలని కోరుకున్నారు. 2021లో, చెన్నైలోని అదే ప్రాంతంలో రాజభవన గృహాన్ని కొనుగోలు చేయమని అతనికి ఆఫర్ వచ్చింది. కొనాలని దినేష్ నిర్ణయించుకున్నాడు. దీపికా, దినేష్ ఇద్దరూ దాదాపుగా క్రీడా ప్రపంచానికి దూరంగా ఉన్నప్పుడు, ఇంత ఖరీదైన ఒప్పందాన్ని ఎలా పూర్తి చేస్తారని అందరూ ఆశ్చర్య పోయారు. మహేంద్ర సింగ్ ధోని చెన్నై సూపర్ కింగ్స్ నుండి వికెట్ కీపర్‌గా అతన్ని తిరిగి జట్టులోకి చూడాలని కోరుకుంటున్నట్లు దినేష్ సమాచారం అందుకున్నాడు. 2022 ఐపీఎల్ వేలం ప్రారంభమైంది. అయితే ఈసారి చెన్నైకి బదులుగా రాయల్ ఛాలెంజర్ బెంగళూరు అతన్ని కొనుగోలు చేసింది. దినేష్ భార్య దీపిక కూడా ఆడటం ప్రారంభించింది. వారి కవలలు పుట్టిన ఆరు నెలలకే, ఆమె గ్లాస్గో సిటీలోని స్క్వాష్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మిక్స్‌డ్ డబుల్‌తో మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆమె భాగస్వామి జోష్న పునప్ప. దినేష్‌కార్తీక్ కూడా తన భార్య విజయంతో ఆనందపరవశుడయ్యాడు. కొత్త జట్టులో చేరాడు. అతను 2022 ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడం ప్రారంభించాడు. ఒకదాని తర్వాత ఒకటి మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతను ఈ ఐపీఎల్‌లో అతిపెద్ద ఫినిషర్‌గా పరిగణించబడ్డాడు. అంతకుముందు రోజు జరిగిన మ్యాచ్‌లో 8 బంతుల్లో మూడు సిక్సర్ల సాయంతో 30 పరుగులు చేశాడు. మ్యాచ్ ముగిశాక దినేష్ డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకోగానే విరాట్ కోహ్లి వంగి వంగి గౌరవించాడు. నేడు భారత టీ20 జట్టులోకి వచ్చిన అతిపెద్ద పోటీదారుగా దినేశ్ కార్తీక్ నిలిచాడు. 37 ఏళ్ల వయసులో, ఈ ఏడాది ఐపీఎల్‌లో అత్యంత ఆటగాడిగా దినేష్ కార్తీక్ నిలిచాడు. ఈయన విజయగాథ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పడిపోయిన తర్వాత లేవడం ఎలాగో కార్తీక్ జీవితం మనకు చెబుతుంది. ఎల్లప్పుడూ ఓపిక పట్టండి. పరిస్థితితో పోరాడుతూ ఉండండి. మీరు తప్పకుండా మీ గమ్యాన్ని చేరుకుంటారు

- జర్నలిస్ట్ నగేష్

## మానవత పేరులోనే 'మానవత్వం'



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

'మానవత' పేరులోనే మానవత్వం ఉందని, పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన మానవత సేవలు విస్తృతం కావాలని ప్రముఖ వైద్యులు, ట్రస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు అన్నారు. ప్రస్తుత కాలంలో వృద్ధుల్లోనే కాకుండా యువతలో కూడా గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోందని, మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 29న జరుపుకుంటారని, గుండెజబ్బుల పట్ల ప్రజలకు అవగాహన కలిగివుండాలని, ఇలాంటి పరిస్థితుల్లో జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండె జబ్బులకు ప్రధాన కారణమని, వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 40 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయలని, సమతుల్య ఆహారం చాలా ముఖ్యమని, జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీల ఆహారానికి బదులు ఆహారంలో బాదం, వాల్‌నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను తినాలని, గుండె సిరలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయని వైస్ చైర్మన్ నటుకుల మోహన్ అన్నారు. చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి సూచనల మేరకు డాక్టర్ అన్నాజీరావుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమెర్జెన్సీ విభాగ సభ్యులు టెక్కం రాంగోల్, సభ్యులు పొడుగు చరణ్, రామం ట్రస్ట్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



అనారోగ్యానికి గురైన టెక్కలి మాజీ ఎంపీపీ తిర్లంగి జానకిరామయ్యను సోమవారం వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ పరామర్శించి క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వైకాపా నాయకులు సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, టెక్కలి

## లలితారెడ్డికి జాతీయ కవితా పురస్కారం

(సత్యంన్యూస్, జి.సిగడాం)

శ్రీశ్రీ కళావేదిక 139వ జాతీయ కవి సమ్మేళనం అనకాపల్లి గౌరీ గ్రంథాలయం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీయ కవితా గానం చేసి అలరించిన స్థానిక కేజీబీవీ తెలుగు ఉపాధ్యాయిని, పుస్తక రచయిత్రి లలితారెడ్డికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ కిరీటధారణ చేసి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఈ నెల 26న ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్, తెలంగాణ ఆలూరి కరుణమ్మ స్మారక జాతీయ సాహితీ కళా సేవా పురస్కారాన్ని ఈమె అందుకున్నారు. ఈమె ప్రతిభను విద్యాలయ ప్రిన్సిపాల్ డి.ఉషారత్నకుమారి, సిబ్బంది ప్రశంసించారు. గ్రామ నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## వాడాడకు సన్మానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న బయాలజీ స్కూల్ అసిస్టెంట్ వాడాడ శ్రీనివాసరావుకు శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. అనకాపల్లిలో నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక 139వ శతాధిక కవి సమ్మేళనంలో శ్రీనివాసరావు అద్భుతమైన కవిత చదివి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పాఠశాల హెచ్ఎం సీహెచ్ దేవ దత్తానంద్ వాడాడ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ పాలిట విలన్! అరబ్బుల హీరో!! నస్రల్లా కథేంటి..?

(మొదటిపేజీ తరువాయి)

నస్రల్లా పేరును సుస్థిరం చేశాయి. ప్రాశ్చాత్య దేశాలు కూడా చర్చించుకునేలా చేశాయి. దక్షిణ లెబనాన్ పై ఇజ్రాయెల్ 30 ఏళ్ల ఆధిపత్యానికి గండి కొట్టి.. ఆ ఆక్రమణ నుంచి హెజ్బొల్లాను విముక్తం చేయడంలోనూ నస్రల్లాదే కీలకపాత్ర! 2006లో 34 రోజుల యుద్ధమనంతరం తాము సాధించింది దైవ విజయమంటూ ప్రకటించి మధ్య ప్రాచ్యంలో ప్రాచుర్యం పొందిన హీరో నస్రల్లా! ఆ యుద్ధం తర్వాత ఇజ్రాయెల్‌కు అతి సమీపంలో ఉండే బింట్ జెబిల్ అనే ఓ పట్టణానికి చేరుకున్న నస్రల్లా.. అక్కడ తన కెరీర్ లోనే గుర్తుండిపోయే ఓ శక్తివంతమైన స్పీచ్‌తో ఆకట్టుకున్నాడు. అదేంటంటే..” అణ్వాయుధాలున్నప్పటికీ.. ఓ సాలెగూడులాగా ఇజ్రాయెల్ పరిస్థితి బలహీనంగా ఉందంటూ పాలస్తీనాలోని అణగారిన వర్గాల్లో ఇజ్రాయెల్ ఇక ముందు కూడా తమనేమీ చేయలేదన్న భరోసా కల్పించే యత్నం చేశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అప్పటికే ఇజ్రాయెల్ దాడులను నిత్యం ఎదుర్కొంటూ వేల మందిని కోల్పోతున్న దృశ్యాలను చూస్తూ పెరుగుతున్న అరబ్బుల్లో అపారమైన గౌరవాన్ని సంపాదించుకున్నాడు నస్రల్లా. మరోవైపు, అదే సమయంలో సౌదీ అరేబియా వంటి సున్నీల ఆధిపత్యం ఎక్కువగా ఉన్నచోట హెజ్బొల్లా, దాని అలయెన్స్ గా ఉన్న ఇరాన్ శత్రుత్వాన్నీ కూడా మూటగట్టుకున్నాయి.

**నస్రల్లా కచ్చితంగా మరణించాడంటూ జెరూసలేం పోస్ట్ ఓ విశ్లేషణ!**

దశాబ్దాల కాలంగా నస్రల్లా ఓ ఫాంటమ్ లా పనిచేస్తూనే ఉన్నాడు. తిరగబడే సున్నీశక్తులకు యమకింకరుడయ్యాడు. ఇజ్రాయెల్‌కు చుక్కలు చూపించి రక్తాన్ని ఏరులై పారించాడు. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్ లోకి హమాస్ చొరబాటనంతరం.. హెజ్బొల్లా హమాస్‌కు సపోర్ట్‌గా 8వేల రాకెట్లను ప్రయోగించింది. దాంతో ఉత్తర ఇజ్రాయెల్ భాగం నుంచి బలవంతంగా ఇజ్రాయెల్ తమ పౌరులను తరలించాల్సిన పరిస్థితేర్పడింది.

అయితే, మొన్న ఆగస్టులో వరుస పేజర్, వాకీటాక్స్ పేలుళ్లతో ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లా కమ్యూనికేషన్ నెట్ వర్క్‌కే దెబ్బ కొట్టింది. వేలాదిమంది యోధులు ఇప్పుడు నిర్వీర్యమైపోయారు. ఒక వారం రోజుల్లో నలుగురు సీనియర్ హెజ్బొల్లా నాయకులను లేపేసిన ఇజ్రాయెల్.. ఇక ఏకంగా బీరూట్ లోని హెజ్బొల్లా ప్రధాన కార్యాలయాల పైనే దాడులకు తెరతీసింది. ఆ ప్రధాన కార్యాలయాల్లోని బంకర్స్ లోనే ఎక్కడో ఓచోట నస్రల్లా ఉండిఉంటాడని ఇజ్రాయెల్ స్పష్టం చేస్తోంది. అయితే, నస్రల్లా మరణం నీడ పడని చోటే ఇంకా సురక్షితంగా ఉన్నాడా.. లేక, ఇజ్రాయెల్ చెబుతున్నట్టుగా చనిపోయాడా అన్నది ఇప్పటికైతే మిస్టరీనే! ప్రస్తుతానికైతే సుదీర్ఘ పోరాటంలో నస్రల్లా నేతృత్వంలోని హెజ్బొల్లా అసిత్వానికే ఎదురైన అతి పెద్ద సవాల్ ఇది!

## ఆహారాన్ని వృధా చేయకండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆహారాన్ని వృధా చేయొద్దని, అవసరానికి తగ్గట్టుగా వేడుకలకు ఆహారాన్ని తయారుచేయాలని వి-వన్ రెస్టారెంట్ అధినేత టెక్కం రాంగోపాల్ పేర్కొన్నారు. పోలాకి మండలం చెల్లాయివలసకు చెందిన పొట్నూరు నారాయణరావు కుమార్తె మోక్షశ్రీ పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలో ప్రధాన కూడళ్లలో సుమారు 200 మంది నిరుపేదలకు ఆదివారం రాత్రి ఆహారం అందించినట్టు తెలిపారు. ఆహారంతోపాటు టూత్‌పేస్ట్, బ్రష్, సబ్బులు అందించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలకు ధనం వృధా చేసే బదులు, పదిమంది ఆకలి తీర్చాలని, అందులోనే ఆనందముందన్నారు. అన్నవితరణ కార్యక్రమంలో టెక్కం రాంగోపాల్, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, డాక్టర్ పైడి ప్రదీప్‌లు పాల్గొన్నారు.



























# లక్ష్యం కోసం పనిచేసే వ్యక్తి ఎమ్మెల్యే శంకర్

- కూటమి ప్రభుత్వంతో సర్పంచులకు పూర్వ వైభవం
- పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

( సత్యంన్యూస్,శ్రీకాకుళం)

సుదీర్ఘమైన లక్ష్యం, ఆశయం, ఆదర్శంతో పనిచేసేవ్యక్తి ఎమ్మెల్యే గొండు శంకర్ అని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవివి రాజేంద్రప్రసాద్ అన్నారు. నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ సన్మాన కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడుగా ఉంటూ శాసన సభ్యునిగా విజయం సాధించిన గొండు శంకర్ చాంబర్‌లో సభ్యుడిగా ఉండడం అందరికీ గర్వకారణమని అన్నారు. శంకర్ ఎమ్మెల్యే అయ్యారంటే రాష్ట్రంలోని సర్పంచ్‌లందరూ ఎమ్మెల్యే అయినట్టేనని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన శంకర్ తాను వేసిన తొలి అడుగు మర్చిపోలేదని తెలిపారు. నిజాయితీ, చిత్తశుద్ధితో సర్పంచ్‌ల సమస్యలుపై ఉద్యమాలు చేశారని తెలిపారు. సుపక్షము, విపక్షంతో పోరాటాలు సాగించి శంకర్ సాధించిన విజయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సర్పంచులకు సంబంధించిన నిధులను సకాలంలో విడుదల చేస్తూ సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొచ్చిందన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 4500 కోట్లు మంజూరయిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1300కోట్లు మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లా డుతూ తాను ఎప్పటికీ పంచాయతీరాజ్ ఛాంబర్ కుటుంబ సభ్యుడినేని తెలిపారు. పంచా యతీరాజ్ ఛాంబర్ ఎంతో ప్రతిష్టమైనదన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో ఎందరో నాయ కులు తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఛాంబర్ క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. తనకు పోరాటపటిమ నేర్పింది పంచాయతీరాజ్ ఛాంబరేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ లో క్రమశిక్షణ తనకు ఎంతో ఇష్టమన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు శంకరన్న అందించిన ప్రోత్సాహం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, వానపల్లి ముత్యాలరావు, చింతకాయల ముత్యాలు, రాష్ట్ర కార్యదర్శి గేదుల రాజారావు, చిత్తూరు, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్క ధనుంజయ యాదవ్, భానోజీ నాయుడు, బుర్ర నాగరాజు, సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు అప్పలనాయుడు, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.




# 'వెంకటేశ' మహత్యం

(మొదటిపేజీ తరువాయి)

రూ.90వేలు డిమాండ్ చేసినట్లు ట్రావెల్ ఏజెన్సీ యజమాని చెబుతున్నారు. అక్రమంగా విత్‌డ్రా చేసిన సొమ్ముకు సంబంధించిన ఆధారాలు సమర్పించినా రూరల్ పోలీసులు స్పందించలేదు. అలాగే తన తల్లి అసలు రంగు తెలియక తండ్రి మీద ఫిర్యాదు చేశానని, ఇందులో వాస్తవం లేదని, దీని వెనుక కుట్ర ఉందంటూ జరిగిన కథను మైనరైన బాలిక మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసినా దీని మీదా ఎటువంటి స్పందనా లేదు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తామని రూ.90 వేలు తీసుకున్న మధ్యవర్తి ఎస్ఐ బదిలీపై వెళ్లిపోవడంతో రూ.45 వేలు వెనక్కు ఇచ్చి మిగతాది ఖర్చయిపోయిందని చేతులు దులుపుకొన్నట్టు తెలుస్తుంది. ఈరెండు పోలీస్‌స్టేషన్లలోనూ బాధితుల నుంచే సొమ్ములు వసూలుచేయడం ఒక నేరం కాగా, ఈ వసూలు కోసం మూడో వ్యక్తిని పెట్టుకొని కథ నడపడం రెండో తప్పు. అందుకే పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాలంటే సామాన్యులు భయపడిపోతున్నారు.

ఫ్రెండ్లీ పోలీస్ అన్న మాటకు పోలీస్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది అర్థం మార్చేస్తున్నారు. సాధారణంగా ఫేవర్ చేసినప్పుడు మాత్రమే లంచం తీసుకుంటారు. కానీ వారి డ్యూటీ చేయడానికి కూడా ఇక్కడ లంచాలు అడుగుతున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబల్‌ను ప్రైవేట్ సెటిల్‌మెంట్ కోసం ఒకరిని ప్రోటోకాల్ పేరుతో ఏర్పాటు చేసుకుంటారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ సంప్రదాయం పోలీస్ స్టేషన్లలో కొనసాగుతుంటుంది. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. వీరిని కలిసి మాట్లాడిన తర్వాతే వ్యవహారం ముందుకు కదులుతుంది.

మరిన్ని వార్తల కోసం
సత్యం వెబ్‌సైట్‌ను చూడండి.
www.satyamdaily.net

# చోరీ సొత్తు రికవరీ

- సిబ్బంది పనితీరును అభినందించిన ఎస్పీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన చోరీ కేసులకు సంబంధిత పోలీసులు ఛేదించి నిందితుల నుంచి సొత్తును రికవరీ చేసినట్టు ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు చోరీ కేసులకు సంబంధించిన పూర్వపరాలను వెల్లడించారు. నేరం జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే చోరి కేసును గార పోలీసు స్టేషన్ పోలీసులు ఛేదించినట్టు తెలిపారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న శ్రీకాకుళం మండలం అలికాంకు చెందిన నాగళ్ల నాగరాజును గార, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. లావేరు పోలీసు స్టేషన్ పరిధిలో నేరానికి పాల్పడిన బెజ్జిపురం గ్రామానికి చెందిన జవ్వాది ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. గార పోలీస్ స్టేషనలో నమోదైన 3 కేసులకు సంబంధించి 85 గ్రాముల బంగారు ఆభరణాలు, కేజీ వెండి వస్తువులు రికవరీ చేసినట్టు తెలిపారు. లావేరు పోలీసు స్టేషన్‌కు సంబంధించి నమోదైన ఒక కేసులో పదహారున్నర తులాల బంగారు అభరణాలు రికవరీ చేసినట్టు వివరించారు. అలాగే శ్రీకాకుళం సబ్ డివిజనల్ పరిధిలో గార, లావేరు పోలీసు స్టేషన్లలో నమోదు కాబడిన చోరీ కేసులకు సంబంధించిన ప్రాపర్టీని పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్టు తెలిపారు. వాహన దొంగతనాలు, ఇళ్లలో, దేవాలయాల్లో జరుగుతున్న నేరాలకు సంబంధించి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేశామని, రాత్రి బీట్ సిస్టంను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, ఉదయం, సాయంత్రం జన సమూహం, వ్యాపార, గృహ సముదాయాల వద్ద విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో గార పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన మూడు కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ పైడిపునాయుడు, ఎస్సై జనార్ధనరావు, సీసీఎస్ స్టేషన్ ఎస్ఐ గఫూర్, పోలీస్ కానిస్టేబుల్ రవికుమార్, జగదీష్, బాలకృష్ణ, లావేరు పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ ఎం.అవతారం, లావేరు ఎస్సై లక్ష్మణరావు, క్లూస్ టీమ్ ఎస్ఐ భరత్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, విజయ్ ఆనంద్‌కుమార్, పోలీసు కానిస్టేబుల్ కె.లక్ష్మణరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# మద్యం దుకాణాల సిబ్బంది విధులు బహిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్, నైట్ వాచ్మెన్ అందరూ ఉద్యోగ భద్రత కోరుతూ అక్టోబర్ 1 నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ మద్యం షాపుల సూపరైవైజర్ సేల్స్‌మాన్ వర్కర్స్ సంఘం యూనియన్ సభ్యులు బి.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వీరికి తక్షణమే ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని కోరారు.

అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300,
98487 96626

# డీఎస్‌వోను కలిసిన ఎండీయూ ఆపరేటర్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నూతన డీఎస్‌వోగా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రకాశ రావును ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం విజయవాడ వరద బాధితులకు సహాయార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9,260 మంది ఆపరేటర్స్ ఒకరోజు వేతనాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కి అందజేయాలని రాష్ట్ర యూనియన్ తీసుకున్న నిర్ణయం కట్టుబడి శ్రీకాకుళం జిల్లా యూనియన్ తరఫున తమ సమ్మతం తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎండీయూ ఆపరేటర్స్ అప్పారావు, దివాకర్, సంతోష్, శివప్రసాద్, కిరణ్, కిట్టు, శ్రీను, జగన్, రాజా, వరుణ్, కిషోర్, మాధవ్, పాపారావు, షేర్‌ఖాన్, శంకర్, ఆమదాలవలస మండల ప్రెసిడెంట్ వరహాల నరసింహులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు అభినందన

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 20మందిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ సోమవారం అభినందించారు. పోటీలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చి 20 ప్రైజ్‌లు తీసుకుని స్టేట్ లెవల్‌కు ఈ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ మాట్లాడుతూ స్టేట్ లెవల్ సెలెక్ట్ అయిన విద్యార్థులు ఇంకా ఉన్నత ప్రతిభ కనపరచి జాతీయ స్థాయికి ఎదిగి మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకొని యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, క్యాంపస్-2లో ఇన్‌ఛార్జి సాగర్, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంగీతం అధ్యాపకులు ధన్నాన శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



# సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తిరుమల లడ్డూ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా పరిషత్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మందిర-అర్చక పురోహిత్ ప్రముఖ్ సింహాద్రి ఫల్గుణ రావు మాట్లాడుతూ సమాజ వికాస కేంద్రాలైన దేవాలయాల్లో ఒక ప్రణాళిక ప్రకారం అన్యమతస్థులు చేరి దేవాలయ వ్యవస్థను అపవిత్రం చేస్తున్నారని, దేవాలయాల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలు, అవినీతిపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఎండోమెంట్ శాఖను రద్దు చేసి హిందూ దేవాలయాలను హిందువులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు గొద్దు భాస్కర్, కోశాధికారి ధర్మవరం ఆచార్యులు, సహ కార్యదర్శి యోగ చంద్రశేఖర్, అల్లు తారకరామారావు, బజరంగదళ్ ప్రముఖులు కొయ్యాన కిరణ్, బొడిగి మధు, వంజల శ్రీనివాసరావు కుప్పిలి గజపతి, బరాటం సంతోష్ కరగాన నాగరాజు, ఆర్ఎస్ఎస్ పెద్దలు పాల్గొన్నారు



# ఆదివాసీ జీవితాలపై అధ్యయనం

(సత్యంన్యూస్, పలాస)

ఆదివాసి గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గం అధ్యక్షులు ఆర్.గంగాభవాని, రాష్ట్ర కార్యదర్శి పి.పద్మతో పాటు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ ఆదివాసీ గ్రామాల అధ్యయనంలో భాగంగా మహిళల జీవన విధానం పరిశీలన కోసం పర్యటన చేశారు. మందస మండలం ఆదివాసీ గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం ప్రతినిధి బృందం పర్యటిస్తూ మహిళల జీవన విధానాన్ని అధ్యయనం చేశారు. ఈ పరిశీలనలో భాగంగా మందస మండలం కొండలోగామ్, బాన్సుగమ్, కిలోగామ్, పలాస మండలం లోత్తూరు, పెదగంతర, చిన్నగంతర, పెద్దపల్లియ, జెన్నాసాయి, చింతవీధి, తుసరాడ గ్రామాల్లోని మహిళల జీవన విధానం మౌలిక వసతులను పరిశీరించారు. ప్రగతి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగాభవాని, రాష్ట్ర కార్యదర్శి పి.పద్మతో పాటు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ, ఇతర కార్యవర్గ సభ్యులు కలిసి ఏజెన్సీ ప్రాంతమంతా పర్యటన చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల లేక, ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తుసరాడ గ్రామంలో బడిఈడు పిల్లలు ఐదు సంవత్సరాల తర్వాత స్కూలుకు వెళ్లాలంటే జనసాయి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం నడవాలని, విద్యార్థులకు మినీ బస్సులను ఏర్పాటుచేసి స్కూలుకు తీసుకెళ్లే వాతవరణం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమాల్లో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యవర్గంతో పాటు ఏజెన్సీ గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



# మామిడి గోవిందరావుకే ఉచిత ఇసుక



(సత్యంన్యూస్, పాతపట్నం)

ప్రజలకు ఉచితంగా ఇసుకను అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి ఇచ్చిన హామీ మేరకు పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు మాత్రమే ఉచిత ఇసుక అందుతుందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల పాలన పూర్తయినా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రహరాజపాలెం జగనన్న కాలనీ ముఖద్వారం మీద ఉన్న వై.ఎస్.ఆర్-జగనన్న కాలనీ పేరును తొలగించడంపై రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆ స్థలాన్ని సందర్శించిన ఆమె మీడియాతో మాట్లాడారు. జగనన్న కాలనీ ముఖద్వారంపై ఉన్న పేరును కక్షపూరితంగా తొలగించి విధ్వంశానికి దిగడాన్ని తప్పుపట్టారు. సంక్షేమ పాలన అందించి జననేతగా చరిత్రకెక్కిన జగన్ పేరును చూసి కూటమి ప్రభుత్వ పాలకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

# అనాథలను ఆదుకోవటం గొప్ప విషయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనాథ బాలబాలికలను, వృద్ధులను, ఏ ఆసరా లేనివారికి ఆదుకోవటం గొప్ప విషయమని ఏ-1 హాస్పిటల్ అధినేత ప్రముఖ వైద్యులు మూల వెంకటరావు సోమవారం అన్నారు. కలెక్టర్ బంగ్లా దరిలోని శాంత అనురాగ నిలయంలో ఎనిమిదేళ్ల సోహిల్ అనే మాటలు రాని అనాథ బాలునకు ఆశ్రయం కల్పించి, అండగా నిలిచిన, అనురాగ నిలయం నిర్వాహకులు పి.జగన్ మోహనరావు సేవలు అనివార్యమన్నారు. సోహిల్‌కు ఆదివారం కడుపులో నొప్పి, వాంతులు అవ్వటంతో అనురాగ నిలయం వార్డెన్ ఆర్.ఆశాలత, అనురాగ నిలయం మదర్ పక్కి లలిత, జగన్ మోహనరావుకు అందించిన సమాచారంతో హుటాహుటిన ఏ-1 హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు డాక్టర్ మూల వెంకటరావు సోహిల్‌కు అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని, ఇది ఒక రకంగా అపెండిసైడిస్ అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్ మోహనరావు మాట్లాడుతూ ఏ-1 హాస్పిటల్ అధినేత మూల వెంకటరావు, ఎమ్మెల్యే గొండు శంకర్ సోద రుడు గొండు గంగాధర్, తమ్మినేని ప్రసాద్‌లు ఈ శస్త్ర చికిత్సకు ఏమీ ఆశించకుండా ఉచితంగా చేశారని, అనురాగ నిలయంలో ఉండే బాలబాలికలకు ఏ అనారోగ్య సమస్యలున్నా నగరంలోని ప్రముఖ వైద్యులంతా అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏపీఆర్వో నంది ఉమాశంకర్, ఏ-1 హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రూ.15లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కేన్సర్ భారిన పడిన గొలివి గణేష్‌కు జరజాం పంచాయతీ గొలివి వానిపేట గ్రామంలోని ఆయన స్వగృహంలో రూ.15 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అందజేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బెందు మల్లేష్, సర్పంచ్ ప్రతినిధి దుంగ దాలినాయుడు, నియోజకవర్గ ఎన్‌డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.